## క్లుప్తంగా

### సివిల్స్ ర్యాంకర్‌కు అభినందన



నెహ్రూ నగర్: జాతీయ స్థాయిలో సివిల్స్‌లో 146వ ర్యాంకు సాధించిన చల్లా పవన్ కళ్యాణ్‌ను నగర మేయర్ రవీంద్ర అభినందించారు. మంగళవారం నగరపాలక సంస్థ మేయర్ చాంబర్‌లో చల్లా పవన్ కళ్యాణ్‌ను శాలువా, బొకేతో సత్కరించి అభినందించారు. మేయర్ మాట్లాడుతూ గుంటూరు నగరానికి చెందిన చల్లా సివిల్స్‌లో జాతీయ స్థాయిలో 146వ ర్యాంకు సాధించటం ఎంతో అభినందనీయమన్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఉద్యోగులు నిత్యం ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ఉంటారని, వారు కుల,మత, పార్టీలకతీతంగా పేద ప్రజలకు న్యాయం జరిగేలా పనిచేయాలన్నారు. నేటి యువత చల్లా పవన్ కళ్యాణ్‌ను ఆదర్శంగా తీసుకొని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు కృషి చేయాలన్నారు.

### గిరి ప్రదక్షిణకు ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీసు

పట్నంబజారు: శివ భక్తుల కోసం పవిత్ర రుణాచలంలో జరిగే పౌర్ణమి గిరి ప్రదక్షిణకు సంబంధించి ప్రత్యేక బస్సు సర్వీసు ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీఎస్ఆర్టీసీ ఆర్ఎం ఎం.రవికాంత్ మంగళవారం తెలిపారు. ఈనెల 12న పౌర్ణమి పురస్కరించుకుని అరుణాచలంలో జరిగే గిరి ప్రదక్షిణకు 10వ తేదీ రాత్రి 9.15 గంటలకు బస్సు బయల్దేరుతోందని చెప్పారు. 11వ తేదీ గోల్డెన్ టెంపుల్, కాణిపాకం, శ్రీకాళహస్తి దర్శించుకుని అదే రోజు రాత్రి అరుణాచలం చేరుకుంటుందని వివరించారు. 12వ తేదీ గిరిప్రదక్షిణ, స్వామి దర్శనం పూర్తయిన తరువాత అదే రోజు రాత్రి బయల్దేరి 13వ తేదీ ఉదయం గుంటూరు చేరుకుంటుందని వివరించారు. ఈసర్వీసుకు సంబంధించి 96164 నంబరు ద్వారా ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకోవాలని సూచించారు. టికెటు ధర రూ. 2,420 నిర్ణయించినట్లు తెలిపారు. వివరాలకు 7382897459 నంబరులో సంప్రదించాలని కోరారు.

### హెవీ మోటారు డ్రైవింగ్‌స్కూల్ ప్రారంభం

పట్నంబజారు: గుంటూరు జిల్లా పరిధిలో లైట్ మోటారు వెహిల్ లైసెన్సు కలిగిన డ్రైవర్లకు సంబంధించి హెవీ మోటారు డ్రైవింగ్ స్కూల్‌ను ప్రారంభించినట్లు ఏపీఎస్ ఆర్టీసీ ఆర్ఎం ఎం.రవికాంత్ మంగళవారం తెలిపారు. ఈ డ్రైవింగ్ స్కూల్‌లో ఇప్పటి వరకు 19 బ్యాచ్‌లకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. 20వ బ్యాచ్‌కు సంబంధించి అడ్మిషన్లు ప్రారంభించినట్లు తెలిపారు. శిక్షణ పొందేందుకు డ్రైవర్లు వారి పేర్లు నమోదు చేసుకోవాలని, కేవలం బ్యాచ్‌కు 16 మందికి మాత్రమే అవకాశం ఉన్నట్లు వివరించారు. ప్రతిరోజూ వాహనం విభాగాలు, వాటి పని తీరు, రోడ్లు, పెయింటింగ్ మార్కుల తోపాటు, వాహనాన్ని నడిపించి శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. ముఖ్యంగా ఘాట్ రోడ్డు, ప్రధాన రహదారుల్లో సైతం అనుభవం ఉన్న సీనియర్ డ్రైవర్లతో శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. శిక్షణ పూర్తయిన తరువాత ఫామ్-5, 5ఏ, సర్టిఫికెట్లు అందజేయడం జరుగుతోందన్నారు. ఆర్టీఏ అధికారులు నిర్వహించే టెస్టులో పాల్గొని లైసెన్సు పొందవచ్చు అన్నారు. వివరాల కోసం 7382894585, 8897371003 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

### శానిటరీ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

నెహ్రూ నగర్: కేటాయించిన విధుల్లో నిర్లక్ష్యం, పారిశుధ్య పర్యవేక్షణ లోపంపై 8వ శానిటరీ డివిజన్ ఇన్‌స్పెక్టర్ పి.రాంబాబుని విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5న క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా 8వ శానిటరీ డివిజన్‌లో కార్మికుల హాజరు రిజిస్టర్‌లో ముగ్గురు కార్మికులు హాజరు నమోదు చేసి ఉండగా, సదరు కార్మికులు విధుల్లో లేరని గుర్తించినట్లు చెప్పారు. సదరు డివిజన్‌లో పారిశుధ్య పనుల పర్యవేక్షణలో కూడా శానిటరీ ఇన్ స్పెక్టర్ రాంబాబు నిర్లక్ష్యంగా కనిపిస్తోందని చెప్పారు. 8 డివిజన్ ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా ఎ.బాబుని నియమించామన్నారు.

### నేడు జీజీహెచ్‌లో కంటి వైద్య పరికరాలు ప్రారంభం

గుంటూరు మెడికల్: స్థానిక జీజీహెచ్‌లో కంటి సమస్యతో వచ్చేవారికి కార్పొరేట్ వైద్య సేవలు ఉచితంగా అందించేందుకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వారు రూ.65 లక్షలు విలువ చేసే కంటి వైద్య పరికరాలు వితరణగా అందజేశారని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ తెలిపారు. జింకానా రూ.20 లక్షల వైద్య పరికరాలు వితరణగా అందజేశారన్నారు. బుధవారం కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా విచ్చేసి వైద్య పరికరాలను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్, నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, జింకానా చైర్మన్ ఆఫ్, బోర్డు ఆఫ్ ట్రస్టీ డాక్టర్ త్రిపురనేని రవికుమార్ అతిథులుగా హాజరవుతారని వెల్లడించారు.

# రోబోటిక్స్ నేర్చుకుందాం..

- సాంకేతిక నైపుణ్యంలో సుశిక్షితులుగా తీర్చిదిద్దే శిక్షణ
- ప్రాథమిక స్థాయి నుంచి తయారీ, పని విధానంపై అవగాహన
- రోబోటిక్స్, ఏఐ, కోడింగ్, యాప్స్ తయారీపై శిక్షణ పొందుతున్న విద్యార్థులు
- వేసవిలో సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ.. నైపుణ్యాలకు పదును



రోబోటిక్స్ తయారు చేయడంలో శిక్షణ కల్పిస్తున్న శిక్షకుడు

గుంటూరు ఎడ్యుకేషన్: వేసవి సెలవుల్లో విద్యార్థులు నైపుణ్యాలను మెరుగులు దిద్దుకుంటున్నారు. ఆట, పాటలతో సరదాగా గడుపుతూనే మరోవైపు భవిష్యత్‌లో ఉపయోగపడే సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకుంటున్నారు. మేధకు పదును పెట్టి నూతన ఆలోచనలతో వినూత్నమైన ఆవిష్కరణలకు శ్రీకారం చుడుతున్నారు. గుంటూరు లక్ష్మీపురంలోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్‌ఈ పాఠశాల వేదికగా ఐఐటీలో చదివిన సాంకేతిక నిపుణులు, సబ్జెక్టు నిపుణులతో విద్యార్థులకు రోబోటిక్స్, ఏఐ టూల్స్, కోడింగ్ అంశాల్లో నిపుణులతో వర్క్‌షాప్ నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు వివిధ రకాల రోబోటిక్స్ గురించి అవగాహన కల్పిస్తూ, వాటిని తయారు చేసే విధానం, పనితీరును స్వయంగా విద్యార్థులే పరిశీలన చేసే విధంగా వర్క్‌షాప్ ద్వారా వివరిస్తున్నారు. ఐఐటీల్లో చదివిన నిపుణులతో ఇస్తున్న శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులు ప్రతి రోజూ వివిధ రకాల సెన్సార్లతో పని చేసే రోబోట్స్‌ను తయారు చేసి, ప్రయోగాత్మకంగా వాటిని పని చేయిస్తున్నారు. రోబోటిక్స్, ఏఐ టూల్స్, కోడింగ్‌లలో విద్యార్థులు నేర్చుకుంటున్న అంశాలు, వాటి ద్వారా భవిష్యత్తులో కలిగే ప్రయోజనాలను శిక్షకులు, ఉపాధ్యాయులు ఈ విధంగా వివరిస్తున్నారు.

### రోబోటిక్స్ శిక్షణతో సాంకేతిక విజ్ఞానం



విద్యార్థుల 21 రోజుల వర్క్‌షాప్‌లో భాగంగా మ్యాక్స్ రోబోట్‌పై పది రకాల ప్రాజెక్టులు తయారు చేయిస్తున్నాం. ఏఐ రోబోటిక్స్‌తో పాటు స్మార్ట్‌ఫోన్, బ్లూ టూత్ ద్వారా అనుసంధానం చేసి పని చేసే రోబోట్స్‌ను రియల్ టైంలో తయారు చేసి, పని చేయించడం ద్వారా నూతన ఆలోచనలను రేకెత్తించేందుకు దోహదం చేస్తుంది. ఇంజినీరింగ్ చదువుల్లో ఎంతో ప్రయోజనం. పోటీతత్వంతో ముందుకు దూసుకెళ్లే నైపుణ్యాలు పొందే వీలుంది.

–డి. శ్రీలక్ష్మి, భౌతికశాస్త్ర ఉపాధ్యాయురాలు

### రోబోటిక్స్‌ను ప్రయోగాత్మకంగా పని చేయించడంలో శిక్షణ



పాఠశాల స్థాయిలో రోబోటిక్స్ తయారీ, ప్రయోగాత్మంగా పని చేయించడంలో కల్పిస్తున్న శిక్షణపై విద్యార్థులు ఎంతో ఉత్సాహాన్ని చూపిస్తున్నారు. రోబోటిక్స్, వెబ్ డిజైనింగ్, ఐఓటీ, ఎంబెడెడ్ సిస్టమ్స్, ఏఐ రోబోటిక్స్ తయారీ, టెస్టింగ్, పని చేయించే విధానాన్ని ప్రత్యక్షంగా చేస్తున్నారు. 10 రకాల రోబోలను తయారు చేసి, వాటిని వివిధ రంగాల్లో ఉపయోగించే విధానాలపై విద్యార్థులు వర్క్‌షాప్‌లో సమగ్ర అవగాహన పొందుతున్నారు.

–కె. కేదార్‌నాథ్, ఎలక్ట్రానిక్స్ నిపుణుడు

### భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు దోహదం



సాంకేతికత ఆధారిత విజ్ఞానాన్ని అందించడంలో కోడింగ్ ఉపయోగపడుతోంది. శిక్షణ ద్వారా యాప్స్‌ను తయారు చేసే విధానంపై పాఠశాల స్థాయిలోనే విద్యార్థుల్లో అవగాహన పెంపొందిస్తున్నాం. బీటెక్ విద్యార్థి దశలో నేర్చుకునే అంశాలను పాఠశాల విద్యార్థి దశలోనే నేర్పించడం ద్వారా విద్యార్థుల మేధకు పదును పెట్టవచ్చు. విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా రూపుదిద్దుకోడంలో సాంకేతిక శిక్షణ దోహదం చేస్తుంది.

–వి.అమరేశ్వరి, కంప్యూటర్స్ శిక్షకురాలు

## దార్శనికుడు డాక్టర్ కొండబోలు

జీవన సాఫల్య పురస్కారం ప్రధానం



బసవపున్నయ్యతోపాటు పలువురికి సత్కారం

నగరంపాలెం: ప్రముఖ వైద్యుడిగా ఆరు దశాబ్దాలకుపైగా, విద్యాప్రదాతగా డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య నిలిచారని డాక్టర్ మద్దినేని గోపాలకృష్ణయ్య అన్నారు. బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై మంగళవారం గుళ్లపల్లి సుబ్బారావు సేవా సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ కొండబోలు బసవపున్నయ్యకు జీవన సాఫల్య పురస్కారం అందించారు. తొలుత పాలక మండలి అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య జ్యోతిప్రజ్వలన చేయగా, సభకు డాక్టర్ రాయపాటి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ గోపాలకృష్ణయ్య మాట్లాడుతూ ఐదు దశాబ్దాలకుపైగా కమ్మ వసతిగృహం అధ్యక్షుడిగా కొనసాగారని అన్నారు. వేలాది మంది విద్యార్థుల భవిష్యత్‌కు పునాదులేశారని అన్నారు. నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ ద్వారా జేకేసీ కళాశాల, ఆర్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాల, హనుమయ్య ఫార్మసీ కళాశాల, మాదల శకుంతల భాస్కర్ నర్సింగ్ కళాశాలల స్థాపనతోపాటు కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్ అధ్యక్షునిగా ముఖ్య భూమిక పోషించారని చెప్పారు. ఆయన మాతృమూర్తి పేరుతో వృద్ధుల ఆశ్రమం స్థాపించి, ఇతోధికంగా సేవలందిస్తున్నారని కొనియాడారు. సీనియర్ వైద్యులు యర్రా నాగేశ్వరరావు మాట్లాడుతూ డాక్టర్ బసవపున్నయ్య ఆర్థిక రంగ నిపుణులుగా, విశ్లేషకుడిగా అనేక మందికి మార్గదర్శకులుగా నిలిచారని అన్నారు. అధ్యక్షత వహించిన డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా గర్వించదగ్గ దార్శనికుడు డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య అని అన్నారు. పెద్ది సాంబశివరావు రాసిన వైద్య నిఘంటువుని డాక్టర్ అర్లపూడి సృజన్‌కుమార్ ఆవిష్కరించారు. అనంతరం శ్రావ్య, శాన్వి కర్రసాము నృత్య ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో సేవ సంస్థ కన్వీనర్ గుళ్లపల్లి రాఘవేంద్రరావు, నిర్వహణ డాక్టర్ చిట్టినేని శివకోటేశ్వరావు, మోదుగుల రవి కృష్ణ, డాక్టర్ బసవపున్నయ్య కుటుంబ సభ్యులు, స్నేహితులు పాల్గొన్నారు.

**బసవపున్నయ్య సేవలు అభినందనీయం**

గుంటూరు ఎడ్యుకేషన్: వైద్య రంగంలో డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య సేవలు అభినందనీయమని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. మంగళవారం స్థానికంగా బసవపున్నయ్య నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యలమంచిలి శివాజీ, శ్రీపాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్, పాఠశాల కమిటీ సభ్యులు బోల్లేపల్లి శ్రీనివాసరావు, గింజుపల్లి వరప్రసాదరావు తదితరులు ఆయన్ను కలిసి అభినందనలు తెలిపారు.

## రాష్ట్రంలోని గ్రంథాలయాల అభివృద్ధికి కృషి



కోటేశ్వరరావుకి వినతిపత్రం అందిస్తున్న గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక ప్రతినిధులు

నగరంపాలెం: రాష్ట్రంలో గ్రంథాలయాల అభివృద్ధికి, మాతృభాషా వికాసానికి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. రాష్ట్ర గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక ప్రతినిధులు మంగళవారం బృందావన్‌గార్డెన్స్‌లోని ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఇటీవల రాష్ట్రంలో జరిగిన కార్యక్రమాలు, రాష్ట్ర సదస్సుల్లో చేసిన తీర్మానాలను వేదిక కన్వీనర్ వల్లూరు శివప్రసాద్, చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. గోనుగుంట్ల మాట్లాడుతూ గ్రంథాలయాల్లో కొత్త పుస్తకాలు కొనుగోలు, ఉద్యోగాల భర్తీ, విద్యా సంస్థల్లో గ్రంథాలయాల అభివృద్ధిపై కసరత్తు చేస్తున్నామని అన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి, త్వరలో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సాహిత్య సభలు, పుస్తక ఆవిష్కరణకు జిల్లా గ్రంథాలయాలు ఉచితం లేదా సాధారణ ఛార్జీలతో అప్పగిస్తామన్నారు. అనంతరం గోనుగుంట్లను సత్కరించి, గ్రంథాలయ ఉద్యమ పుస్తకాలు అందించారు. గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ ప్రతినిధులు చలపాక ప్రకాష్, పరుచూరి అజయ్‌కుమార్, సిహెచ్.సుశీల, మోతుకూరి అరుణకుమార్, నానా, శ్రీవశిష్ట, ఎస్ఎం సుభాని పాల్గొన్నారు.

## కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటాం



చెక్కును అందజేస్తున్న మేయర్ రవీంద్ర, కమిషనర్ శ్రీనివాసులు

నెహ్రూనగర్: కార్మికుల కుటుంబాలకు గుంటూరు నగర పాలక సంస్థ అండగా ఉంటుందని, కార్మికులకు అందాల్సిన పరిహారాలు వెంటనే అందిచడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఇటీవల మరణించిన ప్రజారోగ్య విభాగ అవుట్ సోర్సింగ్ కార్మికులు సీహెచ్ చిన్న మాల్యాద్రి కుటుంబ సభ్యులు అంకమ్మకు ఎక్స్ గ్రేషియాకి సంబంధించి రూ.2 లక్షల చెక్ ను మంగళవారం కౌన్సిల్ సమావేశ మందిరంలో అందించారు. విధి నిర్వహణలో మరణించిన కార్మికుల కుటుంబాలకు నగర పాలక సంస్థ అండగా ఉంటుందన్నారు.

ఇటీవల ప్రజారోగ్య విభాగంలో అవుట్ సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్న చిన్న మాల్యాద్రి అనారోగ్య కారణాలతో మరణించగా, వారి కుటుంబ సభ్యులకు ఎక్స్ గ్రేషియా రూ.2 లక్షల చెక్ ని, మట్టి ఖర్చులు రూ.15 వేలను ఇప్పటికే ఇచ్చామని తెలిపారు. కార్మికుల కుటుంబాలకు నగర పాలక సంస్థ నుంచి అందాల్సిన పరిహారాలు, పి.ఎఫ్. కూడా త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగాధిపతులను, సూపరింటెండెంట్ లను ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఈరంటి వరప్రసాద్, మీరావలి, చిష్టి, ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, సిఎంహెచ్ఓ డాక్టర్ అమృతం పాల్గొన్నారు.

### మరుగుదొడ్డి లేని వారు దరఖాస్తు చేసుకోవాలి

నెహ్రూనగర్: మరుగుదొడ్ల నిర్మాణానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో బహిరంగ మల మూత్ర విసర్జన నిషేధమని, ప్రతి ఇంటికి మరుగుదొడ్డి కల్పించడానికి కేంద్ర ప్రభుత్వ సహకారంతో వ్యక్తిగత హౌస్ హోల్డ్ టాయ్‌లెట్ పథకంలో భాగంగా నగరంలో మరుగుదొడ్ల నిర్మాణానికి దరఖాస్తులను నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని పుర సేవ కేంద్రం, కాల్ సెంటర్ లో బుధవారం నుంచి అందుబాటులో ఉంటాయని వివరించారు. ప్రజారోగ్య రక్షణలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఇంటికి మరుగుదొడ్డి ఉండేలా చేయూత ఇస్తుందని పేర్కొన్నారు. ఇంటిలో స్థలం ఉండి, మరుగుదొడ్లు లేని వారు నగరపాలక సంస్థలోని పురసేవ కేంద్రం, కాల్ సెంటర్ లో రైస్ కార్డ్, ఆధార్ కార్డ్ జిరాక్స్, ఫోన్ నంబర్,కుల ధ్రువీకరణ, బ్యాంక్ అకౌంట్ వివరాలతో దరఖాస్తులు తీసుకొని పూర్తి చేసి అందించాలని కోరారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

### శిక్షా అవార్డు పొందిన విజేత స్కూల్



అవార్డు అందుకుంటున్న పాఠశాల యాజమాన్య ప్రతినిధులు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని విజేత ఐఐటీ ఫౌండేషన్ స్కూల్ 2024-25 విద్యాసంవత్సరంలో ప్రదర్శించిన అత్యుత్తమ నిబద్ధత, నైపుణ్యానికి లీడ్ గ్రూప్ నుంచి జాతీయస్థాయిలో శిక్షా అవార్డు అందుకున్నట్లు పాఠశాల వ్యవస్థాపకుడు శ్రీనివాస్, డైరెక్టర్లు సురేష్, గిరీష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదేళ్లుగా లీడ్ పాఠ్యాంశాలను అమలు చేస్తూ, విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీస్తూ, చదువులో తల్లిదండ్రుల ప్రమేయాన్ని మెరుగుపర్చినట్లు తెలిపారు. ఇటీవల నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవంలో పాఠశాల ప్రిన్సిపాల్ సుహాసిని, హెచ్ఆర్ మేనేజర్ విజయలక్ష్మి, కో-ఆర్డినేటర్ లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

### నగరంలో పారిశుద్ధ్య పనులు పక్కాగా జరగాలి

నెహ్రూ నగర్: నగరంలో పారిశుద్ధ్య పనులు పక్కాగా నిర్వహించాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర కోరారు. మంగళవారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి కౌన్సిల్ సమావేశ మందిరంలో పారిశుద్ధ్య పనుల నిర్వహణపై సచివాలయ ఎన్విరాన్మెంట్, ఎమినిటీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ రాజధాని పరిధిలో ఉన్న దృష్ట్యా పారిశుద్ధ్యం పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యదర్శులకు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పారిశుద్ధ్య పనుల నిర్వహణలో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని వెంటనే పరిష్కరిస్తామన్నారు. కమిషనర్ మాట్లాడుతూ, ప్రస్తుతం వేసవి కాలం దృష్ట్యా పారిశుద్ధ్య కార్మికులను దృష్టిలో పెట్టుకొని ఉదయం 5 గంటల నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 3.30 గంటల నుండి 6 గంటల వరకు సమయాన్ని నిర్దేశించుట జరిగిందన్నారు. సమావేశంలో సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, ఈఈలు సుదర రామి రెడ్డి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## స్విమ్మింగ్ పూల్ వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

కమిషనర్ శ్రీనివాసులు



స్విమ్మింగ్ పూల్ వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

నెహ్రూనగర్: ఎన్టీఆర్ మున్సిపల్ స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరానికి అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరవుతున్న దృష్ట్యా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. కమిషనర్ శ్యామల నగర్ మెయిన్ రోడ్‌లోని స్విమ్మింగ్ పూల్‌ను మంగళవారం పరిశీలించారు. సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. తొలుత క్యాంప్‌కు ఎంత మంది వస్తున్నారు, నీటి నాణ్యతపై స్విమ్మర్లు, తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. పూల్‌ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా నిర్వహించాలని, లైటింగ్, నీటి ఫిల్టరేషన్ ఎప్పటికప్పుడు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రథమ చికిత్స కిట్‌ని అందుబాటులో ఉంచాలని కోరారు. రద్దీ దృష్ట్యా మరో పూల్ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం శ్యామల నగర్, వెంకటరమణ కాలనీ, పట్టాభిపురం ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు పరిశీలించి, రోడ్ల పక్కన వ్యర్థాలు వేయకుండా ప్రజారోగ్య అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. రోడ్ల మీద, డ్రెయిన్‌లలో వ్యర్థాలు వేసే వారిని గుర్తించి భారీ మొత్తంలో అపరాధ రుసుం విధించాలని, కమర్షియల్ సంస్థలను సీజ్ చేయాలని ప్రజారోగ్య అధికారులకు స్పష్టం చేశారు. పర్యటనలో కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, బయాలజిస్ట్ రామారావు పాల్గొన్నారు.

## సీహెచ్‌ఓ సమస్యలు తక్షణమే పరిష్కరించాలి



నిరసన తెలియజేస్తున్న అసోసియేషన్ నేతలు, సభ్యులు

లక్ష్మీపురం: సీహెచ్‌ఓల సమ్మెకు ఏఐటీయూసీ నాయకులు మంగళవారం మద్దతు తెలిపారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవెల్ ప్రొవైడర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న సీహెచ్‌ఓల ఆందోళన తొమ్మిదో రోజుకు చేరింది. గుంటూరు కలెక్టర్ కార్యాలయం వద్ద నుంచి నగరంపాలెం మీదుగా గుర్రం జాషువా విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కుతున్నారని విమర్శించారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఆరు సంవత్సరాలు విధులు నిర్వహించిన అనంతరం రెగ్యులరైజ్ చేస్తామని రాతపూర్వకంగా ఉద్యోగస్తులకు హామీ ఇచ్చి, నేడు దాన్ని అమలుపరచుకుండగా వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. ఎన్ హెచ్ ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ జరగాలని, పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు.

## పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రత్యేక పూజలు



విశ్వశాంతి హోమంలో ఎమ్మెల్యే మాధవి

నగరంపాలెం: దివ్య దృష్టితో రాసిన కాలజ్ఞానం ద్వారా భూత, భవిష్యత్, వర్తమానాలు విశదీకరించిన సాక్షాత్ భగవత్ స్వరూపులు విరాట్ శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి అని ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. అమరావతిరోడ్డు బ్రహ్మంగారి గుడి వీధిలో కొలువైన జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల ఆరాధన, గురుపూజోత్సవం మంగళవారం రెండో రోజుకి చేరాయి. వీరబ్రహ్మేంద్రస్వామిని ఎమ్మెల్యే మాధవి దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలో పాల్గొని పతాకావిష్కరణ చేశారు. ప్రధాన కార్యదర్శి నాగేశ్వరచారి మాట్లాడుతూ వీరబ్రహ్మేంద్రస్వామి సజీవ సమాధి నిష్ట వహించిన పర్వదినం సందర్భంగా ఈనెల 7న పంచామృత అభిషేకాలు, పల్లకిసేవ, భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహిస్తామని అన్నారు. అనంతరం నగర ప్రధాన వీధుల్లో సంకీర్తన రథోత్సవ ఊరేగింపు ఉంటుందని తెలిపారు. వీరవల్లి బాబూరావు, రమణమ్మ దంపతుల విశ్వశాంతి హోమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ అధికార ప్రతినిధి దామచర్ల శ్రీనివాసరావు, అడక శ్రీనివాసరావుయాదవ్, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు పావులూరి హనుమంతరావు, మహిళా అధ్యక్షురాలు ఎ.సుశీల, దేవస్థానం పాలక మండలి అధ్యక్షులు కె.సుబ్బారావు, నాయకులు గట్టి శ్రీనివాసరావు, వెంకటాచారి, బి.కోటేశ్వరరావు, ప్రధానార్చకులు ఎం.బాలసుర్యం పాల్గొన్నారు.

## పాటకు సమస్యలపై కదిలించే శక్తి



సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

లక్ష్మీపురం: సమస్యలపై ప్రజలను కదిలించగలిగే శక్తి ఒక పాట ఒక నాటికకు ఉందని సీఐటీయూ నాయకులు వై.నేతాజీ అన్నారు. మేడే వారోత్సవాల్లో భాగంగా మంగళవారం అడవితక్కెలపాడు పరిధిలోని పుచ్చలపల్లి సుందరయ్య కాలనీలో సీఐటీయూ ఆధ్వర్యంలో మేడే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా కార్మికుల్లో ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు సీఐటీయూ కృషి చేస్తుందన్నారు. నగర ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించవద్దని, నిత్యావసరాల ధరలు అదుపు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ట్రూ-అప్, సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం మే 20న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు వివిధ అభ్యుదయ గీతాలకు నృత్యాలు చేశారు. సీఐటీయూ నాయకులు జి.లూథర్ పాల్, సిహెచ్ కిన్నర్ అభ్యుదయ గీతాల ఆలపించారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర నాయకులు షేక్ మస్తాన్ వలి, షేక్ ఖాసిం షహీద్, ఆది నికల్సన్, షేక్ బాషా, సిపాన పద్మనాభుడు, బి.సుకన్య, ఫ్రీ ట్యూషన్ సెంటర్ టీచర్ కె.సుజాత పాల్గొన్నారు.

## గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు



విద్యార్థులతో గ్రంథాలయాధికారులు శకుంతల, సత్యశిరీష

గుంటూరు ఎడ్యుకేషన్: బృందావన్‌గార్డెన్స్‌లోని మహిళా బాలల గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు కథలు చెప్పడం, పుస్తక పఠనం, కలరింగ్, పేపర్ క్రాఫ్ట్స్, తెలుగు పద్యాలు, జనరల్ నాలెడ్జ్ అంశాలపై అవగాహన కల్పించారు. శిక్షణ శిబిరాన్ని గ్రంథాలయాధికారులు బి. శకుంతల, పి.సత్యశిరీష పర్యవేక్షించారు.

- ఏసీ కళాశాల ఎదుట ఉన్న ప్రాంతీయ గ్రంథాలయంలో విద్యార్థులకు భారతదేశ మ్యాపులో రాష్ట్రాలను గుర్తించడంపై ఎమ్మెస్సీ విద్యార్థిని వి.వెంకటకృష్ణ అవగాహన కల్పించారు. అదే విధంగా మహాకవి శ్రీశ్రీ జీవితంలోని ముఖ్యాంశాలతో పాటు చందమామ కథలు చెప్పారు. శిక్షణ శిబిరాన్ని ఇన్‌చార్జి గ్రంథ పాలకుడు కె.సుధాకర్‌రావు, సహాయ గ్రంథ పాలకుడు షేక్ ఖయ్యూం పర్యవేక్షించారు.

### నేడు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం

నెహ్రూ నగర్: నగరపాలక సంస్థ సాధారణ కౌన్సిల్ సమావేశం బుధవారం నిర్వహించనున్నారు. ఉదయం 11.30 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి మేయర్ కోవెలమూడి రవీంద్ర అధ్యక్షత వహించనున్నారు. తొలుత 9.30 గంటలకు శంకర్ విలాస్ ఆర్ఓబీ నిర్మాణ పనులకు కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం కౌన్సిల్ సమావేశం జరగనుంది.